నేడు ఈద్-ఉల్-ఫితర్

- ముగిసిన రంజాన్ ఉపవాసాలు
- ప్రార్థనల కోసం ఈద్గాలు, మసీదులు ముస్తాబు

మెదక్‌లో ప్రార్థనలు చేసే ఈద్గా మైదానం

మెదక్ మున్సిపాలిటీ/ నర్సాపూర్, ఏప్రిల్ 10 : రంజాన్ పురస్కరించుకుని నెలరోజులు గా కొనసాగిన ముస్లింల ఉపవాసాలు ముగిశాయి. మార్చి 12న రంజాన్ మాసం ప్రారంభమై ఏప్రిల్ 10తో ముగిసింది. ఈ సందర్భంగా గురువారం ఈద్-ఉల్-ఫితర్‌ను జిల్లా వ్యాప్తంగా జరుపుకోనున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు ఈద్గాలను ముస్తాబుచేశారు.

ఈద్గా వద్ద ఏర్పాట్లు

బుధవారం నెలవంక కనిపించడంతో గురువారం రంజాన్ పండుగ చేసుకోవాలని మత పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రం మెదక్‌లోని ఈద్గా, మసీదులను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. పారిశుధ్య సిబ్బంది ఈద్గా పరిసరాలను శుభ్రం చేశారు. పనులను మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షించారు. ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నీటి వసతి ఏర్పాటు చేశారు.

నర్సాపూర్‌లో ఈద్గా పరిశీలన

నర్సాపూర్ పట్టణంలోని నమాజ్ గడ్డ ఈద్గా వద్ద ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీమొద్దీన్‌తో కలిసి పరిశీలించారు. ముస్లింలు ప్రార్థనలు చేసుకోడానికి వీలుగా పరిసరాలను శుభ్రం చేయించి, నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వీరితో మాజీ ఎంపీటీసీ మౌలానా మసిఉద్దీన్, గులాం అలీ సాజిద్, ముస్లిం మత పెద్దలు ఉన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ) : పవిత్ర రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పర్వదినం సందర్భంగా ముస్లింలకు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ముస్లింలు నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్ష తో నిష్ఠగా అల్లాను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం కొనసాగించారని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. రంజాన్ మాసంలో భక్తిప్రపత్తులు, ఏకాగ్రత, ఆత్మను క్రమపద్ధతిలో ఉంచుకుని క్రమశిక్షణతో ఉపవాస దీక్షలు కొనసాగించారని వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు ప్రత్యేకమైన 'గంగ జమునా తెహజీబ్' గా పరిఢవిల్లాలని ఎమ్మెల్సీ ఆకాంక్షించారు.

రేపు బీఆర్ఎస్ నాయకుల సమావేశం

చిలిపిచెడ్, (కొల్చారం)/ వెల్దుర్తి, ఏప్రిల్ 10: కొల్చారం, చిలిపిచెడ్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నేతల సమావేశాన్ని శుక్రవారం కౌడిపల్లి మండలం రాయలాపూర్‌లోని నర్సింగ్‌రావు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మండలాల అధ్యక్షులు గౌరీశంకర్, అశోక్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నిర్వహిస్తున్న సమావేశానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.

రేపు వెల్దుర్తిలో సమావేశం

వెల్దుర్తి, మాసాయిపేట మండలాల కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం వెల్దుర్తిలో నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి తెలిపారు. వెల్దుర్తిలోని బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే సమావేశానికి ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరవుతున్నారన్నారు.

'విశ్వకర్మ' జాతీయ టెక్నికల్ ఇన్‌చార్జిగా రామోజు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 10 : విశ్వకర్మ మహాసభ జాతీయ టెక్నికల్ ఇన్‌చార్జిగా రామోజు కామాచార్యులను నియమించినట్లు జాతీయ అధ్యక్షుడు మహేంద్ర విశ్వకర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియామక పత్రాన్ని ఉపాధ్యక్షుడు కొండముది బంగారుబాబు ఆధ్వర్యంలో అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కామాచార్యులు మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న దేశంలో విశ్వకర్మలు కొత్త టెక్నాలజీని పూర్తిస్థాయిలో ఉపయోగించుకుని ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాతీయ స్థాయి బాధ్యతలు అప్పగించిన నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

స్వచ్ఛత పాటించాలి

మెదక్‌రూరల్, ఏప్రిల్ 10: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని మెదక్ ఎంపీవో ప్రశాంత్ తెలిపారు. మండలంలోని మక్తభూపతిపూర్, మాల్కాపూర్‌లోని పల్లె ప్రకృతివనాలు, డంపింగ్‌యార్డులు, నర్సరీలు, పంచాయతీలో పారిశుద్ధ్య పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని వన నర్సరీల్లోని మొక్కలపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిత్యం తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. డ్రైనేజీలను పరిశుభ్రంగా ఉంచి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీవో సూచించారు.

మెదక్‌లో బీఆర్ఎస్‌దే విజయం

సంతోష్‌రావు

చిలిపిచెడ్ (కొల్చారం), ఏప్రిల్ 10: మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండానే అని బీఆర్ఎస్‌వై కొల్చారం మండలాధ్యక్షుడు సంతోష్‌రావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ బలంగా ఉందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీ తప్పుడు ప్రచారాన్ని ప్రజలే తిప్పికొడతారన్నారు.

అల్లాదుర్గం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా రఘుపతి

అల్లాదుర్గం, ఏప్రిల్ 10 : అల్లాదుర్గం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా గొండ రఘుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం అల్లాదుర్గం ఎల్లమ్మ ఆలయ పరిధిలో ప్రెస్ క్లబ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా గొండ రఘుపతి, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, ఉపాధ్యక్షులుగా వీరేందర్, రమేశ్, కార్యదర్శిగా పాపయ్యచారి, కోశాధికారిగా వెంకట్‌రామ్‌గుప్తా, గౌరవ అధ్యక్షుడిగా భూమయ్య, సలహాదారుడిగా కుమార్, సభ్యులుగా సాయిలు, నరేశ్, శేఖర్, వెంకట్, రాజు, నర్సింహులు, శంకర్, రాజు ఎన్నికయ్యారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్, SBI దగ్గర, 161 చ॥గ॥ ఇంటి స్థలం అమ్మబడును. సంప్ర: 8143366630 / 9989554915.
NT-113

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311823-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పోలీసుల నిఘా కట్టుదిట్టం

- జిల్లాలో 7 చెక్ పోస్టులు ఏర్పాటు
- విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

మెదక్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు నిఘా కట్టుదిట్టం చేశారు. కోడ్‌ను పటిష్టంగా అమలుచేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మద్యం రవాణాను అడ్డుకునేలా తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో దామరచెరువు, మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బోధన్ ఎక్స్‌రోడ్, వెల్‌కం బోర్డు, హవేళీఘనపూర్ పోలీస్‌స్టేషన్‌లో పోచమ్మరాల్, మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కాళ్లకల్, నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మల్లన్నగుడి, పెద్దశంకరంపేట పోలీస్‌స్టేషన్‌లో కోలపల్లి వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఈక్రమంలో నగదు, మద్యం రవాణాకు చెక్ పెడుతున్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా రూ.21,27,330 నగదుతోపాటు రూ. 9,75,800 విలువైన మద్యం పట్టుకున్నారు.

వివరాలు గోప్యంగా ఉంచుతాం

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. జిల్లాలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లా వ్యాప్తంగా 7 చెక్ పోస్టులను ఏర్పాటుచేశాం. ఎప్పటికప్పుడు చెక్‌పోస్టులను పర్యవేక్షిస్తున్నాం. రూ.50వేల కంటే ఎక్కువ ఉన్న నగదును స్వాధీనం చేసుకుంటున్నాం.

- ఎస్సీ బాలస్వామి

నేడు పూలే జయంతి

మెదక్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జ్యోతి బాపూలే చిత్రపటానికి నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

బెజ్జంకి, ఏప్రిల్ 10 : మండలంలోని గూడెం గ్రామానికి చెందిన హన్మాండ్ల సందీప్‌రెడ్డి(29) కారులో వెళ్తూ బేగంపేట శివారులో అదుపుతప్పి చెట్టుని ఢీకొని మృతి చెందినట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. సందీప్ రెడ్డి తన మిత్రుడు వడ్లూర్ గ్రామానికి చెందిన పొట్ల రాజుతో కలిసి కారులో గూడెం వస్తుండగా బేగంపేట శివారులో అదుపు తప్పి చెట్టుని ఢీకొన్నది. దీంతో సందీప్‌రెడ్డి మృతి చెందగా, గాయపడిన రాజును కరీంనగర్‌లో ప్రైవేట్ దవాఖానకు తరలించినట్లు చెప్పారు.

దళారులను ఆశ్రయించొద్దు

- కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలి
- ధాన్యం తూకంలో మోసాలు ఉండొద్దు
- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా చేపట్టాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. యాసంగి సీజన్‌లో వచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించవద్దని సూచించారు. హవేళీఘనపూర్ మండలంలోని శమ్నాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా టెంట్లు, తాగు నీరు, విద్యుత్ వసతి కల్పించాలన్నారు. టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలని, నిర్దేశించిన విధంగా కొనుగోళ్లు చేయాలని సూచించారు.

మద్దతు ధరకే విక్రయించాలి

రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. రైతులు ధాన్యాన్ని తాలు లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ కేంద్రాలకు తరలించాలన్నారు. రైతులకు టోకెన్లు ఇవ్వాలని, దాని ప్రకారం కొనుగోళ్లు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు కేటాయించిన రైస్ మిల్లులకు ధాన్యాన్ని వెంటనే తరలించాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట పౌరసరఫరాల అధికారులు బ్రహ్మరావు, హరికృష్ణ తదితరులు ఉన్నారు.

శమ్నాపూర్‌లో ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

నాగసాన్‌పల్లి విద్యార్థులకు జిల్లాస్థాయి అవార్డులు

విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో అవార్డు అందుకుంటున్న నాగసాన్పల్లి విద్యార్థులు

పాపన్నపేట, ఏప్రిల్10: ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో మండలంలోని నాగసాన్పల్లి జడ్పీ హెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. నాగసాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు విష్ణువర్ధన్, మరిచు ఎలేందర్ ప్రతిభ కనబరిచి నాలుగు అవార్డులు గెలుపొందినట్లు ఉపాధ్యాయుడు అశోక్ కుమార్ తెలిపారు. వీరికి బుధవారం మెదక్‌లో డీఈవో రాధాకృష్ణన్ అవార్డులు అందజేశారు.

బండపోసన్‌పల్లిలో వరి దిగుబడి అంచనా

పంటకోత ప్రయోగం నిర్వహించి ధాన్యం తూకం వేస్తున్న అధికారులు

వెల్దుర్తి, ఏప్రిల్ 10: మండలంలోని బండపోసన్‌పల్లి గ్రామంలో యాసంగి పంట దిగుబడి అంచనాపై ప్రణాళిక అధికారులు వరి పంటపై బుధవారం ప్రయోగం చేశారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి మాన్య మాట్లాడుతూ.. వరి పంట కోత ప్రయోగంలో భాగంగా పొలంలో ఐదు మీటర్ల వెడల్పు, ఐదు మీటర్ల పొడవు విస్తీర్ణంలో పంట కోసి, నూర్పిడి చేసి, ధాన్యం తూకం వేశామన్నారు. కాగా 12.800 కిలోల దిగుబడి వచ్చిందని, దీని ప్రకారం ఎకరం పొలంలో 20 నుంచి 22 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. మండలంలో ఈ పంట ప్రయోగాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ ఉప గణాంక అధికారి శ్రీనివాస్, మండల అధికారి దివ్యభారతి పాల్గొన్నారు.

అగ్రహారం పాఠశాలకు సామగ్రి అందజేత

అగ్రహారంలోని ప్రాథమిక పాఠశాలలో మాట్లాడుతున్న 'బెస్ట్‌రన్నర్' సభ్యులు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 10: మండలంలోని అగ్రహారంలోని ప్రాథమిక పాఠశాలకు బెస్ట్‌రన్నర్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు రూ.45వేల ప్రింటర్, సౌండ్‌సిస్టమ్‌ను బుధవారం అందజేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధిస్తున్న ఉపాధ్యాయులకు స్వచ్ఛంధ సంస్థ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శివకుమార్, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, బెస్ట్ రన్నర్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ కమిటీలతో సమావేశం

మెదక్ పట్టణంలోని కార్యాలయంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 10: మెదక్ పార్లమెంట్‌లోని 2166 పోలింగ్ బూత్‌ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతోపాటు కో ఆర్డినేటర్లతో జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్‌పార్క్‌లో గురువారం సమావేశం నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఏవిధంగా ముందుకెళ్లాలో దిశానిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు. పార్లమెంట్ పరిధిలోని మూడు జిల్లాలు, 7 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొంటారన్నారు. మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, నాయకులు ముక్క సుధాకర్, కాశీనాథ్, మధుసూదన్ పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే


తిమ్మాపూర్ మల్లన్న జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట, ఏప్రిల్ 10: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో జరుగుతున్న మల్లన్న స్వామి జాతరలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి బుధవారం పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మల్లన్నస్వామి ఆశీర్వాదంతో పాడి పంటలు బాగుండాలని కోరుకున్నట్టు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డితో కల్లూరి హరికృష్ణ, మాజీ సర్పంచ్‌లు అనూష అశోక్‌గౌడ్, బాబూరావు, చంద్రకళ శ్రీశైలంయాదవ్, చెన్నానాయక్, సీనియర్ నాయకుడు మర్రి మహేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

మహిళలు పోషకాహారం తీసుకోవాలి

ఆర్.వెంకటాపూర్ అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ సుజన

రామాయంపేట, ఏప్రిల్ 10: అంగన్‌వాడీ సెంటర్లలో కిశోర బాలికలకు ఐరన్ మాత్రలు పంపిణీ చేసినట్లు రామాయంపేట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజన తెలిపారు. బుధవారం మండలంలోని కోనాపూర్, ఆర్.వెంకటాపూర్ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు చేశారు. గర్భిణులకు పసుపు, కుంకుమ, బట్టలు, పండ్లు అందజేశారు. మహిళలందరూ పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అనుష్క, రాణి, రోజా, పంచాయతీ కార్యదర్శి నీహెచ్ శ్యామల ఉన్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చర్యలు

కొల్చారం: రోడ్లపై ధాన్యం ఆరబోసిన రైతులకు పలు సూచనలు ఇస్తున్న ఎస్సై మహ్మద్ గౌస్

చిలిపిచెడ్ (కొల్చారం)/ నిజాంపేట, ఏప్రిల్ 10 : కొల్చారం మండల వ్యాప్తంగా రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చర్యలు తప్పవని ఎస్సై మహ్మద్ గౌస్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు రోడ్లపై ధాన్యం వేయడంతో జరిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి..

రోడ్లపై ధాన్యం (వరి, మక్కజొన్న) ఆరబెట్టకూడదని నిజాంపేట ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్లపై ధాన్యం ఆరబోసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ దవాఖానలో చలివేంద్రం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ లింబాద్రి

రామాయంపేట, ఏప్రిల్ 10: రామాయంపేటలోని ప్రభుత్వ దవాఖానలో స్నేహబంధు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని దవాఖాన సూపరింటెండెంట్ లింబాద్రి బుధవారం ప్రారంభించారు. చలివేంద్రంతో రోగులు, దవాఖాన సిబ్బందికి తాగునీటి ఇబ్బందులు తీరుతాయన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు సుకేశిని, లయన్స్ క్లబ్ సభ్యులు, స్నేహబంధు జోన్ చైర్మన్ రవీందర్‌గౌడ్, దామోదర్‌రావు, లక్ష్మణచారి, గడ్డం గంగారాం, బాదె గౌరయ్య, కందిమల్ల శ్రీనువాస్ రావు, దీప్‌చంద్, సతీశ్‌రావు ఉన్నారు.

పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవాలు


నిజాంపేటలో పెద్దమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

నిజాంపేట, ఏప్రిల్ 10 : నిజాంపేటలోని పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవాలు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా గణపతి పూజ, గంగతెప్ప, ఉత్సవ విగ్రహ ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గ్రామాధ్యక్షుడు బాబు, కార్యదర్శి బాబూరావు, సభ్యులు మహేందర్, సత్తయ్య, శ్రీనివాస్, సత్తయ్య, కరుణాకర్, స్వామి, భాను, గణేశ్, నగేశ్, ప్రశాంత్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీపీలు


మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్, ఏప్రిల్ 10 : టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ సమక్షంలో నర్సాపూర్, శివ్వంపేట మండలాలకు చెందిన మాజీ ఎంపీపీలు నర్సాపూర్‌లో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. నర్సాపూర్ మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, శివ్వంపేట మాజీ ఎంపీపీ గోవిందర్‌నాయక్ కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ జ్యోతీసురేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశం, నాయకులు సుహాసినిరెడ్డి, శేషసాయిరెడ్డి, నవీన్‌గుప్తా, అశోక్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల అందజేత

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 10: ఉపాధి కూలీలకు పనిచేసే చోట సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు అంబాజీపేట పంచాయతీ కార్యదర్శి దుర్గాభవాని తెలిపారు. బుధవారం గ్రామంలో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను కార్యదర్శి భవాని, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్ అందించారు.

అగ్ని ప్రమాదం

చేగుంట, ఏప్రిల్ 10 : అగ్ని ప్రమాదంలో రూ.లక్షకు పైగా ఆస్తి నష్టం జరిగిన ఘటన చేగుంట మండలం వడియారంలో బుధవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు.. వడియారం గ్రామానికి చెందిన కౌడి నర్సింహులు ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఇల్లు మొత్తం కాలిపోయింది. ఈ ఘటనలో ఇంట్లోని విలువైన వస్తువులు, వంట సామగ్రి, బట్టలు కాలిబూడిదయ్యాయి. వీటి విలువ సుమారు రూ.లక్షకు పైగా ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

ఎడ్లబండ్ల ఊరేగింపు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 10: ఉగాది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గజగట్లపల్లి వేంకటేశ్వర ఆలయంలో బుధవారం పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు ఆలయం చుట్టూ అలంకరించిన ఎద్దులతో బండ్లను ఊరేగించారు.